నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 20 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

నిందితులతో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

పద్ధతి మార్చుకోకపోతే పీడీయాక్టే

● మంచిర్యాల డీసీపీ భాస్కర్ ● గంజాయి కేసులో పట్టుబడ్డ వారికి కౌన్సెలింగ్

మంచిర్యాల అర్బన్, జూలై 19 : గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వారు ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని, లేదంటే పీడీ యాక్ట్ తప్పదని మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ అన్నారు. శుక్రవారం స్థానిక డీసీపీ కార్యాలయంలో గంజాయి కేసులో పట్టుబడ్డ నిందితులకు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ నేర ప్రవృత్తిని మార్చుకోకుంటే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు. మంచిర్యాల జోన్ పరిధిలో గంజాయి రవాణా, అమ్మకాలు జరుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఏసీపీలు ఆర్.ప్రకాశ్, రవికుమార్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నలుగురు యువకులకు..

మందమర్రిలో గంజాయి తాగుతూ పట్టుబడ్డ నలుగురు యువకులకు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో డీసీపీ ఏ.భాస్కర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో ఒకరు ఐటీఐ పూర్తి చేయగా, మరొకరు ఐటీఐ చదువుతున్నాడు. మిగతా ఇద్దరు యువకులు పెయింటింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గంజాయి విక్రయించినా, రవాణా చేసినా 87126 71111, టోల్ ఫ్రీ టీజీఏఎన్‌బీ 14446 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

అర్హులందరికీ రుణమాఫీ అమలు చేయాలి

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 19 : అర్హులందరికీ ఎలాంటి ఇబ్బందుల్లేకుండా రుణమాఫీ అమలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీతో కలిసి సందర్శించారు. రుణమాఫీ పథకం నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి షరతులు విధించకుండా నిబంధనల మేరకు జమ అయిన రుణ మొత్తాన్ని రైతులకు చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్యశాఖలో బదిలీలు

మంచిర్యాల డీఎంహెచ్‌వోగా డా.హరీశ్‌రాజ్

డా.హరీశ్ రాజ్

మంచిర్యాల అర్బన్, జూలై 19 : మంచిర్యాల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో పలువురు అధికారులు శుక్రవారం బదిలీ అయ్యారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.హరీశ్ రాజ్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం జనగామ జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు. త్వరలో బదిలీ పై ఇక్కడికి రానున్నారు. ఇక్కడ ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న డా.అనిత తిరిగి ఇమ్యునైజేషన్ అధికారిగా విధుల్లో కొనసాగనున్నారు. అలాగే బెల్లంపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.విజయ పూర్ణిమ రాంగారెడ్డి జిల్లాకు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న డా.ఎల్ సుధాకర్ నాయక్ ఇక్కడికి రానున్నారు. ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారిగా విధులు నిర్వహిస్తున్న డా.నీరజ హైదరాబాద్‌లోని సరోజని దేవి హాస్పిటల్‌కు బదిలీపై వెళ్తున్నారు. ఆమె స్థానంలో పెద్దపల్లి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్/డీవైసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న క్రుప బాయి నియమితులయ్యారు. తాండూర్ పీహెచ్‌సీలో మెడికల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డా.కుమార్ స్వామి.. భీమిని పీహెచ్‌సీకి, భీమినిలో విధులు నిర్వహిస్తున్న డా.కృష్ణ సీహెచ్‌సీ లక్షెట్టిపేటకు బదిలీ అయ్యారు. తాళ్లగురిజాల పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న డా.ఝాన్సీ తాండూర్ పీహెచ్‌సీకి నియమితులయ్యారు. కోటపల్లి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సత్యనారయణ అంగరాజ్‌పల్లి పీహెచ్‌సీకి, కోటపల్లి పీహెచ్‌సీకి డా.అరుణశ్రీ రానున్నారు. అలాగే నిజామాబాద్ జిల్లాకు చెందిన మెడికల్ అధికారి డా.కే.జాహ్నవి తాళ్లగురిజాల పీహెచ్‌సీకి బదిలీపై వస్తున్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ కుమార్‌దీపక్ ● మంచిర్యాలలోని ఎన్టీఆర్ నగర్‌లో పర్యటన

రాళ్లవాగు పక్కనే ఉన్న ఇంటిలో నివసించే మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్

మంచిర్యాలటౌన్, జూలై 19 : వర్షాకాలం నేపథ్యంలో వరదలపై అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శుక్రవారం మంచిర్యాలలోని వరద ప్రభావిత ప్రాంతమైన ఎన్టీఆర్‌నగర్‌లో మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. రాళ్లవాగు నిండుగా ప్రవహిస్తున్నదని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇరిగేషన్ అధికారులతో రాళ్లవాగు బఫర్‌జోన్ హద్దులను గుర్తించి మార్కింగ్ చేయాలని, బఫర్ జోన్‌కు ఇవతల నివాసాలు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణంలో ముంపు ప్రాంతాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈ మధూకర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాథోడ్ ఉన్నారు.

రుణ మాఫీ కాకపాయె!

● రూ. లక్షలోపు రుణమున్నా కనిపించని రైతుల పేర్లు ● అస్పష్ట జాబితాతో అయోమయంలో అన్నదాతలు

● సమాచారం కోసం బ్యాంకులు, కార్యాలయాల వద్దకు పరుగులు ● ఏదో ఒకటి సర్దిచెప్పి పంపిస్తున్న అధికారులు, బ్యాంకర్లు

మంచిర్యాల, జూలై 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన మొదటి విడుత రుణమాఫీలో అనేక మంది రైతుల పేర్లు గల్లంతయినట్లు తెలుస్తున్నది. ఒకరిద్దరు కాదు.. వేలాది మందికి అన్యాయం జరిగినట్లు సమాచారమున్నది. జాబితాలో లేని రైతులకు రుణమాఫీ జరుగుతుందా..? లేదా..? అన్నదానిపై స్పష్టత నివ్వకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. అసలు ఏ నిబంధనల ప్రకారం రుణమాఫీ చేశారో స్పష్టత ఇవ్వకపోవడం అయోమయానికి గురిచేస్తున్నది. అసలు రుణమాఫీ అర్హుల జాబితా ఏ ప్రాతిపదికన తయారు చేశారన్న దానిపైనా క్లారిటీ లేదు. రుణమాఫీకి రేషన్‌కార్డు ప్రామాణికం కాదని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రేషన్‌కార్డు యూనిట్‌గా రుణమాఫీ చేస్తుండడంతో ఇప్పటికే చాలా మందికి అన్యాయం జరిగింది. రేషన్‌కార్డు లేని వారికి అసలు మాఫీ జరగలేదు. దీనిపై వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే రేషన్‌కార్డు లేనోళ్లకు సర్వే చేసినంక మాఫీ చేస్తారని చెబుతున్నారు. ఆ సర్వే ఎప్పుడు చేయాలి.. మా రుణాలు ఎప్పుడు మాఫీ కావాలంటూ రైతులు పెదవి విరుస్తున్నారు. లిస్టులో పేర్లున్నప్పటికీ కొందరు రైతులకు రుణాలు మాఫీ కాలేదు. బ్యాంకులకు వెళ్లి అడిగితే ప్రాసెస్‌లో ఉంది రేపో.. ఎల్లుండో పడుతుందని, ట్రెజరీలో ఉంది ఇంకా పడలేదని చెబుతున్నారు. మరికొందరు రైతులకు కేవైసీ పెండింగ్ ఉండడం వల్ల రుణం మాఫీ కాలేదంటూ చెప్పుకొస్తున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామీణ బ్యాంకుల్లో లోన్లు తీసుకున్న రైతులు చాలా మందికి రుణాలు మాఫీ కాలేదు. జన్నారంలో ఓ రైతు నా లోన్ ఎందుకు మాఫీ అవ్వలేదని అడిగితే... 'బ్యాంక్ అధికారులు మా చేతుల్లో ఏం లేదు.. ప్రభుత్వం పంపించిన రైతుల రుణాలు మాత్రమే మాఫీ చేస్తున్నాం.. లేని వారివి చేయడం లేదు'అంటూ తెగేసి చెప్పినట్లు తెలిసింది. దీంతో ఆ రైతు ప్రెస్‌క్లబ్ దగ్గరకు వచ్చి తన ఆవేదన వ్యక్తం చేశాడు. రూ. లక్ష లోపు రుణం ఉన్నా.. మాఫీ కాని కొందరు రైతులు తమ గోడును 'నమస్తే తెలంగాణ'కు చెప్పుకున్నారు.

గందరగోళం..

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ), జూలై 19 : జిల్లాలో రూ. లక్ష లోపు పంటరుణాలు తీసుకున్న రైతులు 1.22 లక్షల మంది ఉండగా, ప్రభుత్వం రూ. 125.50 కోట్ల రుణాలు మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. వీరిలో ఎంత మందికి రుణాలు మాఫీ అయ్యాయో అధికారుల వద్ద స్పష్టమైన సమాచారం లేకపోవడం రైతులను గందరగోళానికి గురిచేస్తున్నది. తమకు రుణమాఫీ ఎందుకు కాలేదో అర్థంకాక అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఎందుకు రుణం మాఫీకాలేదో బ్యాంకు వారికి తెలుసని.. వ్యవసాయ అధికారులు అంటుంటే.. వ్యవసాయ అధికారులకు తెలుసని.. బ్యాంకు అధికారులు చెబుతున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు.

సార్లను అడిగితే నోరు మెదపలే

వాంకిడి, జూలై 19 : ప్రభుత్వం రూ. లక్ష లోపు పంట రుణం మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. కానీ నాకు వాంకిడిలోని స్టేట్ బ్యాంకులో రూ. 97 వేల రుణం ఉంది. మాఫీ కాలే. లిస్టులో నా పేరు లేదు. నా పేరు ఎందుకు రాలేదని శుక్రవారం బ్యాంకుకు వెళ్లి సార్లను అడిగిన. వాళ్లు నోరు మెదపలే. ఎంతో ఆశతో ఎదురు చూసిన. ఇలా అవుతుందనుకోలే. **- ఆత్రం అయ్యి, చౌపన్‌గూడ, వాంకిడి మండలం**

కేవైసీ చేయించకుంటే రుణమెట్లా ఇచ్చారో..

వాంకిడి, జూలై 19 : వాంకిడిలోని స్టేట్ బ్యాంకులో రూ. 90 వేల పంటరుణం తీసుకున్న. ప్రభుత్వం గురువారం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. శుక్రవారం బ్యాంకుకు వెళ్లి రుణమాఫీ ఎందుకు కాలేదని అడిగిన. నేను కేవైసీ చేయించలేదని చెప్పిన్రు. మరి కేవైసీ చేయించకపోతే నాకు పంటరుణం యేటా ఎలా ఇచ్చారో అర్థం కావడం లేదు. కాంగ్రెస్ పంటరుణాలు మాఫీ చేస్తదని మస్తు నమ్మినం. గిట్లా మా ఆశలపై నీళ్లు చల్లుతదని అనుకోలే.

- ఆత్రం మెంగు, ఖానాపూర్, వాంకిడి మండలం

బాధగా ఉంది

తాండూర్, జూలై 19 : నాకు కాసిపేట గ్రామంలో కొంత వ్యవసాయ భూమి ఉంది. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ. 43 వేల పంట రుణం 2023కు ముందే తీసుకున్న. అప్పటి నుంచి యేటా మిత్తి కట్టి తిరిగి రుణం తీసుకుంటున్న. ప్రభుత్వం చెప్పినట్లు రుణమాఫీ అవుతుందనుకున్న. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో నా పేరు లేదు. నాకు రేషన్ కార్డు లేదు, ఫ్యామిలీ వివరాలు సరిగా లేవని, ఎంక్వయిరీ చేయాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. నాకు తక్కువ భూమి ఉన్నా రుణ మాఫీ చేయలేదు. ఇందుకు బాధగా ఉంది.

- బోగె కృష్ణ, రైతు, కాసిపేట

మా ఇద్దరికీ రాలే

తాండూర్, జూలై 19 : కేసీఆర్ సర్కారులో నా భార్య ఉప్పరి భూదేవి పేరిట తీసుకున్న రుణం మాఫీ అయ్యింది. గతంలో బ్యాంకులో తీసుకున్న పంట అప్పు రెండు నెలల కిందే కట్టాను. ఇప్పుడే మో నా భార్యతో పాటు నాకు కూడా రుణమాఫీ కాలే. గతంలో నా పేరిట రూ. 50 వేలు, నా భార్య పేరిట రూ. 50 వేల రుణం తీసుకుంటే మాఫీ అయినయి. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారులో కాలే. నాకు, నా భార్యకు కలిపి రూ. లక్ష లోపే రుణం ఉంది. కానీ ఇద్దరిలో ఎవరికీ రుణమాఫీ అవ్వలే. కాంగ్రెస్ సర్కారోళ్లు ఏం చెబుతున్నరో.. ఏం చేస్తున్నరో అర్థం కావడం లేదు. వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లి అడిగితే డబ్బులు వస్తాయని చెబుతున్నరు. **- ఉప్పరి భూదేవి-లచ్చయ్య, రేచిని**

లిస్టులో పేరున్నా మాఫీ కాలే..

తాండూర్, జూలై 19 : 2021లో తీసుకున్న రూ. 82 వేలకు పోయినేడు బ్యాంకులో రిన్వల చేసిన. రెండు నెలల కిందే వడీత్తో సహా చెల్లించాను. సిబిల్ స్కోర్ కోల్పోకుండా ఉండేందుకు డబ్బులు చెల్లించిన. లిస్టులో పేరు ఉన్నప్పటికీ రుణమాఫీ జరగలేదు. ప్రస్తుతం నాకు రావాల్సిన డబ్బులు ట్రెజరీకి వెళ్లిపోయినట్లు తెలిసింది. వ్యవసాయ అధికారులు మాత్రం ప్రాసెస్‌లో ఉంది డబ్బులు పడుతయని చెబుతున్నరు. నాకు న్యాయం చేయాలే. **- పబ్బని తిరుపతి, తాండూర్**

మాకు తెల్వదంటున్నరు

జన్నారం, జూలై 19 : నాకు మా ఊరిలో ఎకరం భూమి ఉంది. 30-6 -2020న ఇందన్‌పల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో రూ. 45 వేల రుణం తీసుకున్న. నాకు రుణమాఫీ కాలే. బ్యాంక్, వ్యవసాయశాఖ అధికారులను కలిసి అడిగితే మేము లిస్టు పంపించలేదు. దాని గురించి మాకు తెల్వదంటున్నరు. అన్ని అర్హతలున్న నాకు రుణమాఫీ చేయకపోవడమేమిటి. ఇప్పటికైనా న్యాయం చేయాలె.

- రాజమౌళి, కిష్టాపూర్

మంచిర్యాల టౌన్ : రంగంపేట కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరద

సిర్పూర్(టీ) చీలపల్లి ప్రధాన రహదారిలో వరద ధాటికి తెగిపోయిన కల్వర్టు

నెన్నెలలో పిడుగు పాటుకు కూలిన ఇంటి ప్రహరీ

కోటపల్లి : లింగన్నపేట-ఎదుల్లబంధం గ్రామాల మధ్య తెగిన రోడ్డు

కుండపోత..

● ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో జోరువాన ● ఉప్పొంగిన వాగులు.. వంకలు

● నదులకు భారీగా పెరిగిన వరద ● తెగిపోయిన కల్వర్టులు.. రోడ్లు

● జలమయమైన కాలనీలు.. కూలిన ఇళ్లు

● ఎదుల్లబంధం వద్ద తెగిన రోడ్డు.. 10 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

● కోటపల్లి మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే వివేక్

నమస్తే నెట్ వర్క్, జూలై 19 : కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు కుండపోత వర్షం పడింది. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రాజెక్టుల్లోకి భారీగా వరద వచ్చి చేరుతున్నది. పలుచోట్ల కాలనీలు జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కాగజ్‌నగర్ పట్టణంలోని సంజీవయ్య కాలనీ, మారుతీనగర్, ద్వారకానగర్, మసీదు ఏరియా, కాపువాడ ప్రాంతంలో ఇళ్లలోకి వరద చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందు పడ్డారు. యువకులు పలు కాలనీల్లో సహాయక చర్యలు చేపట్టారు. సర్ సిల్క్ కాలనీలోని జడ్పీ సెకండరీ పాఠశాల (బాలికలు)లోని తరగతి గదుల్లోకి వర్షపు నీరు చేరగా, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. సిర్పూర్(టీ) మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు, కాలనీలు నీట మునిగాయి. సిర్పూర్(టీ) నుంచి చీలపల్లి గ్రామానికి వెళ్లే దారిలోని కల్వర్టు వరద ధాటికి కొట్టుకుపోయింది. దీంతో చీలపల్లి, మేడిపల్లి, లింబుగూడ, మాలిని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇటుకలపాడు వాగు, దోర్‌పల్లి, లక్ష్మీపూర్ వాగులు ఉప్పొంగడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు సాగలేదు. పెన్‌గంగ నది ప్రవాహం పెరుగుతున్నది. కౌటాల మండలంలో తాటిపల్లి వద్ద వార్దా నది నిండుకుండలా ప్రవహిస్తున్నది. చింతలమానేపల్లి మండలంలోని దిందా-కేతిని, బాబాసాగర్-నాయకపుగూడ గ్రామాల మధ్య ఉన్న వాగులు ఉప్పొంగడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గూడెం అంతర్రాష్ట్ర వంతెన వద్ద ప్రాణహిత నిండుకుండలా ప్రవహిస్తున్నది. పెంచికల్‌పేట్ మండలంలోని పెద్దవాగు, ఉచ్చమల్లి వాగు, బొక్కివాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొండపల్లిలో ఊర చెరువు మత్తడి ఓవైపు కొట్టుకుపోయింది. దహెగాం మండలం బీబ్రా, ఐనం, దహెగాం, లగ్గాం, ఒడ్డుగూడ తదితర గ్రామాల్లో పత్తి పంటలు నీట మునిగాయి.. చిన్నరాస్పల్లి గ్రామానికి చెందిన రామగుండం సంజీవ్ ఇల్లు కూలింది. మంచిర్యాల జిల్లా నెన్నెలలో పిడుగుపడి ముద్ర కోళ సదయ్య ఇల్లు ప్రహరీ ధ్వంసమైంది. బెస్తవాడలోని ఇండ్లలోకి వరద రావడంతో ప్రజలు రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చింది. లంబాడీ తండా సమీంలోని ఎర్రవాగు ఉప్పొంగడంతో కాజ్‌వే పై ఉన్న సిమెంట్ స్లాబ్ కొంత కొట్టుకు పోయింది. కోటపల్లి మండలం ఎదుల్లబంధం గ్రామం సమీపంలోని తుంతుంగ చెరువు వద్ద రోడ్డు తెగిపోగా, ఎదుల్లబంధం, సిర్సా, పుల్లగామ, రొయ్యలపల్లి, ఆలుగామ, జనగామ, సూపాక, నందరాంపల్లి, వెంచపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నక్కలపల్లి గ్రామానికి వెళ్లేదారిలో ఉన్న లో తొర్రెలోని లోలెవల్ వంతెన కొట్టుకుపోగా, నక్కలపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాలతో పాటు వేమనపల్లి మండలం బద్దంపల్లి, చామనపల్లి, బొమ్మెన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రాజారం నుంచి బబ్బెరచెలుక గ్రామాలకు వెళ్లేదారిలో ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మిస్తుండగా, పక్కన నిర్మించిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. కోటపల్లి మండలకేంద్రంలో ఆకుల సమ్మక్క-చిరంజీవికి చెందిన ఇల్లు కూలిపోయింది. కోటపల్లి మండలంలో ఎమ్మెల్యే వివేక్ పర్యటించి పరిశీలించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే పురాణం సతీశ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు మూల రాజిరెడ్డి, పోటు రాంరెడ్డి, మహేశ్‌ప్రసాద్, అజ్గర్ మోహియొద్దీన్, గుర్రం రాజన్న, గట్టు లక్ష్మణ్ గౌడ్, సీత రాంరెడ్డి ఉన్నారు. చెన్నూర్ మండలం కత్తరశాల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అక్కెపల్లి సమీపంలోని కాజ్‌వే పై నుంచి వరద ప్రవహించడంతో అక్కెపల్లి, శివలింగాపూర్ గ్రామాలకు నాలుగు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. భీమిని మండలం ఖర్జీభీంపూర్ సమీపంలోని రహదారి కల్వర్టు తెగిపోగా, నాయబ్ తహసీల్దార్ అంజయ్య, ఆర్ఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు. మంచిర్యాల వద్ద రాళ్లవాగు ఉప్పొంగి ప్రవహించింది. బైపాస్‌రోడ్డులో ఉన్న రంగంపేట కాజ్‌వే పైనుంచి వరద ప్రవహించింది. రంగంపేట, పాతమంచిర్యాల, శ్రీలక్ష్మీనగర్, సన్‌సిటీ, పవర్‌సిటీ, అండాళమ్మకాలనీలకు రాకపోకలు నిలిచిపోయాయి.

● జన్మదిన శుభాకాంక్షలు
● పొలిటికల్
● స్వదేశాగమనం
● లీగల్ ప్రకటనలు
● క్లాసిఫైడ్స్
● పదవీ విరమణ
● ప్రారంభోత్సవం
● శ్రద్ధాంజలి
● సినిమా
● వివాహ మహోత్సవం
● షష్టిపూర్తి మహోత్సవం మరియు
● అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679